సాక్షి సిద్దిపేట

ఆదివారం । 23 । ఫిబ్రవరి । 2025



అంతర్ జిల్లా దొంగ అరెస్టు

ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు 8లో ▸



శిఖం.. ఖతం

ప్రభుత్వ ఆస్తులను కాపాడవలసిన బాధ్యత ను అధికారులు తుంగలో తొక్కేస్తున్నారు. వివరాలు 9లో ▸



అగ్గితెగులు నివారణ చర్యలు

వరికి సోకే అగ్గితెగులు నివారణకు చర్యలు తీసుకోవాలని ఎఈఓ నాగార్జున రైతులకు సూచించారు. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

చేర్యాల(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా పది కేంద్రాల్లో ఆదివారం గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు డీసీఓ ఎల్.పుల్లయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురుకులాల్లో 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 9 లోగా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఒడిశా జాతీయ శిబిరానికి పూలే విద్యార్థిని



ఎం.వైష్ణవి

వర్గల్(గజ్వేల్): ఒడిశాలో నిర్వహించనున్న జాతీయ సమగ్రత శిబిరానికి వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎం.వైష్ణవి ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్‌రావు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాధారాణి శనివారం తెలిపారు. కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం బెర్హంపూర్ యూనివర్సిటీలో వచ్చే నెల 3 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం జరుగుతుందన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్‌గా అందులో పాల్గొనే అవకాశం దక్కించుకున్న డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని వైష్ణవిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

అధ్యాపకుడికి బంగారు నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న వైకుంఠం

సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు వైకుంఠానికి జాతీయ బంగారు నంది అవార్డు లభించింది. తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. సంస్థ నేషనల్ చైర్మన్ యాదీ రత్నం, అవార్డు కమిటీ డాక్టర్ ఉషారాణి, హైకోర్టు అడ్వకేట్ డా.జగదీశ్వర్‌రావు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర, రాష్ట్ర అధ్యక్షుడు వేంకటేశ్వర్లు అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ తెలుగు కళారత్నాల సంస్థ గాయకుడిగా తన సేవలను గుర్తించి తనకు ఈ అవార్డును అందించడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ డా.అయోధ్యరెడ్డి, సీఓఈ డా.గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా.మధుసూదన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డా.శ్రద్ధానందం, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం ఆయనను అభినందించారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన పీడీ



ధరణి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న మకరందు

సిద్దిపేటరూరల్: మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రాజెక్టు డైరెక్టర్(సీఎంఆర్ఓ) మంద మకరందు శనివారం సందర్శించారు. ధరణి రిజిస్ట్రేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. నూతనంగా తీసుకువచ్చిన భూమాత రిజిస్ట్రేషన్ పోర్టల్‌కు సంబంధించి కొన్ని సూచనలు, సలహాలు చేశారు. ధరణి రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వివరాలు, ఎదురయ్యే ఇబ్బందుల గురించి తహసీల్దార్ వెంకట్‌రెడ్డి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీటీ రాజేశం, సీనియర్ అసిస్టెంట్ లలిత, అధికారులు సుమతి, శ్రీనివాస్, కవిత, రజిత తదితరులు పాల్గొన్నారు.





బాలికల హాస్టల్‌లో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి... విద్యార్థి రోహన్‌కు ల్యాప్‌టాప్, ఫీజుకు ఆర్థిక సాయం చేస్తున్న కలెక్టర్

పల్లెబాట... ప్రజలకు బాసట

- విద్య, వైద్యం మొదటి ప్రాధాన్యం
- సమీకృత కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ ఏర్పాటు
- ప్రజావాణిలో సమస్యలు వింటూ...పరిష్కరిస్తూ
- పలువురు అధికారులపై క్రమశిక్షణ చర్యలు
- ఏడాదిలో కలెక్టర్ మనుచౌదరి పనితీరు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బయోమెట్రిక్

సాక్షి, సిద్దిపేట: క్షేత్రస్థాయి సందర్శనలు... ప్రజలతో మమేకం...సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ జిల్లా కలెక్టర్ మనుచౌదరి ముందుకు సాగుతున్నారు. పాలనలో తనదైన శైలిని చూపుతూ, విద్య, వైద్యంకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. నిత్యం ప్రజలకు,ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంటూ జిల్లాను అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్నారు. కలెక్టర్‌గా మొదటిసారి జిల్లా బాధ్యతలు తీసుకుని అధికారయంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్నారు. కలెక్టర్‌గా జిల్లా బాధ్యతలు స్వీకరించి సోమవారానికి ఏడాది పూర్తవుతోంది. సమస్యలపట్ల ఆయన వ్యవహారశైలి, దృష్టికోణం, పనితీరుపై సాక్షి ప్రత్యేక కథనం...

సమస్యల పై ఆరా

జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలతో పాటు పల్లెబాట పడుతున్నారు. వెళ్లిన ప్రతీ చోట పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ఆస్పత్రి, మోడల్ స్కూళ్లు, గురుకులాలు, వసతి గృహాలు ఇలా అక్కడ ఉన్న ప్రభుత్వ సంస్థలను సందర్శించి సమస్యల్ని ఆరా తీస్తున్నారు. సమస్య ఏదైనా దృష్టికొస్తే చాలు వెంటనే పరిష్కరిస్తున్నారు.

విద్యకు ప్రాధాన్యం

విద్యకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందేవిధంగా కృషి చేస్తున్నారు. ఈ ఏడాది కాలంలో డీఎంఎఫ్(జిల్లా మినరల్ ఫండ్) ద్వారా పాఠశాలల అభివృద్ధి కోసం సుమారుగా రూ.40కోట్లను వెచ్చించి మూత్రశాలలు, అదనపు తరగతి గదులు, పాఠశాలలో కనీస వసతుల కల్పించారు. కోహెడ మండలంకు చెందిన పేద విద్యార్థి రోషన్ డబ్బులు లేకపోవడంతో తిరుపతి ఐఐటీలో సీటు వచ్చిన జాయిన్ కాలేదు. ఇదే విషయాన్ని జూలై 26న 'సాక్షి'లో కథనంగా ప్రచురిస్తే కలెక్టర్ వెంటనే సదరు విద్యార్థి రోషన్‌ను పిలిపించి మొదటి సెమిస్టర్ ఫీజు రూ 36,750, ఒక ల్యాప్‌టాప్‌ను వెంటనే అందించారు. ఇలా కలెక్టర్ చేయూతను అందించడంతో విద్యార్థి చదువుకుంటున్నారు.

సమయపాలన పాటించే విధంగా

జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో వివిధ శాఖ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించే విధంగా బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్ ఏర్పాటు చేశారు. గతంలో ఉద్యోగులు సమయపాలన పాటించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఇటీవల బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజేషన్‌ను ఏర్పాటు చేయడంతో అందరు సమయపాలన పాటిస్తున్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ

ప్రజల సమస్యలు ఆలకించడంతో పాటు ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందుబాటులో ఉండి అర్జీదారుల గోడు విని అధికారులకు అప్పటికప్పుడే ఆదేశాలిస్తున్నారు.

పలువురు అధికారులపై చర్యలు

అవినీతి అక్రమాలకు పాల్పడిన, పలు ఆరోపణలు వచ్చిన జిల్లా అధికారులను వెంటనే ఆయా శాఖలకు సరెండర్ చేస్తూ చర్యలు తీసుకుంటున్నారు. గతంలో పని చేసిన జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ పై పలు ఆరోపణలు రావడంతో ఓ అధికారితో కమిటీ వేసి...వారిచ్చిన నివేదిక ప్రకారం వ్యవసాయ శాఖకు సరెండర్ చేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీరాం రెడ్డిపై పలు ఆరోపణలు రావడంతో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డిని విచారణ అధికారిగా నియమించారు. శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన నివేదికతో ఎస్సీ కార్పొరేషన్‌కు నివేదిక పంపించారు. దీంతో ఆ శాఖ అధికారులు శ్రీరాంరెడ్డిని బాధ్యతల నుంచి తప్పించి మరో అధికారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఇలా తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నారు.

కలుపుగోలుగా ఉంటూ...

కొన్ని జిల్లాల్లో అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు ఎక్కువగా ఉంటారు. అదే సిద్దిపేట జిల్లాకు వచ్చే సరికి ప్రతిపక్షం బలంగా ఉంటుంది. ప్రతిపక్ష, అధికార పార్టీ ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ వారు చేసిన విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారం చూపుతూ ముందుకు సాగుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యేందుకు ఎంతగానో కృషి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందే విధంగా కృషి చేస్తున్నారు.

• రాసి పెట్ ఉండాలి

దర్జా బతుకు..!



- కుక్కలకు పెరుగుతున్న క్రేజ్
- కుటుంబంలో ఒకటిగా స్థానం కల్పిస్తున్న పెట్ లవర్స్
- ఇంటి రక్షణ కోసం పెంపకం
- జాతిని బట్టి రూ.వేల నుంచి రూ.లక్షల్లో ఖరీదు
- పెట్ క్లబ్‌లకూ భలే డిమాండ్
- మంచి ఆహారం, కాస్మోటిక్స్, బాతింగ్

సండే స్పెషల్ వివరాలు 8లో ▸

'ఏం బతుకురా నీది.. కుక్క బతుకు' అని చాలా తేలిగ్గా మాట్లాడుతాం. ఈ తిట్టుకు ఇప్పుడు అర్థం మార్చేస్తోంది ఆధునిక సమాజం. పూట కూడా గడవని మనుషులు ఒకవైపు.. విలాసాలకు అలవడిన ధనికులు మరోవైపుగా చీలిపోతున్న సమాజంలో పెంపుడు కుక్కలకూ మనషుల జీవనశైలి అలవాటు చేస్తోంది. ఇప్పుడు కుక్కలు పార్కులకు వెళ్తాయి.. స్విమ్మింగ్ పూల్‌లో ఈత కొడతాయి..వాటికి నచ్చిన ఆహారం తింటాయి.. ఉదయాన్నే బయటికి వెళ్లి షికార్లు కొడతాయి. పుట్టిన రోజులు కూడా చేసుకుంటాయి. తోటి కుక్కలతో కలసి పార్టీలు చేసుకుంటాయి. మనిషి, శునకాల జీవనశైలికి అంతగా తేడాలేకుండా పోతుందని ఆశ్చర్యపడుతున్నారా? అవును.. రూ.లక్షలు ఖర్చు చేసి మరీ వాటి బాగోగులు చూస్తున్నారు. డాగ్ లవర్స్ అనే పరిధి దాటి పెట్ పేరెంట్స్‌గా చెప్పే స్థాయికి చేరుకుంది ఎలైట్ సొసైటీ. పెట్‌ను పెంచుకోవడమంటే వారి కుటుంబంలోకి ఓ వ్యక్తిని ఆహ్వానించినట్లే.. మరి ఆ అతిథిని వీరంతా ఎలా చూసుకుంటున్నారనే దానిపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

– పర్చ శ్రీనాథ్, రామచంద్రాపురం(పటాన్‌చెరు)

పకడ్బందీగా రంజాన్ ఏర్పాట్లు చేయండి

అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ హమీద్

సిద్దిపేటరూరల్: రంజాన్ నెల ప్రారంభమవుతుందని, ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కో ఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి మొదటి వారం రంజాన్ మాసం ప్రారంభం నుంచి ముగిసే వరకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మసీదు పరిసరాల్లో శానిటేషన్ పనులు, సరిపడే విధంగా నీటి సరఫరా ఉండేలా గ్రామాల్లో డీపీఓ, మునిసిపాలిటీల్లో మున్సిపల్ కమిషనర్‌లు చూసుకోవాలని ఆదేశించారు. ఉదయం, సాయంత్రం ప్రార్థనా సమయాల్లో కోతలు లేని విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ముఖ్య దినాలలో మసీదుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. శాంతి భద్రతలకు భంగం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముస్లిం కమిటీ పెద్దలు అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్డీవోలు సదానందం, చంద్రకళ, ఏసీపీలు మధు, పురుషోత్తం, సతీష్, డీపీఓ దేవకీదేవి, డీఎం ఎచ్ఓ పల్వాన్ కుమార్, ఏఓ అబ్దుల్ రహమాన్, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ముస్లిం కమిటీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బ్యాంక్ రుణాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సెర్ప్, మెప్మా ఉద్యోగులకు అదనపు కలెక్టర్ గరిమా ఆదేశం

సిద్దిపేటరూరల్: బ్యాంకు లింకేజి రుణాలను స్వయం సహాయక సంఘ సభ్యులందరికి నిర్దేశించిన మేరకు సకాలంలో అందించి, ఉపాధి అవకాశాలను పెంచాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సెర్ప్, మెప్మా ఉద్యోగుల సమీక్ష సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్యాంకు లింకేజీ రుణాలు, ఇందిరా మహిళా శక్తి–ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లను, పాడి పశువుల కొనుగోలు యూనిట్స్‌ను, యూనిఫాం స్టిచింగ్‌పై మండల స్థాయి ఏపీఎం, సీసీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు నిర్దేశించిన మేర బ్యాంకు లింకేజి రుణాలను అందించాలని కోరారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.895.61 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలను అందించాల్సి ఉండగా.. రూ.831.98 కోట్ల రుణాలను అందించారని, మిగిలిన రూ.63.62 కోట్ల వాటిని మార్చి 7వ తేదీ లోపు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాలు వంద శాతం టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు డీఆర్డీఓ జయదేవ్ ఆర్య మాట్లాడుతూ బ్యాంకు లింకేజిలో జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గత సంవత్సరం విద్యార్థులకు యూనిఫాంలు సకాలంలో అందించి ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుంచి స్వయం సహాయక సంఘాలు మంచి పేరును పొందాయని, అదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. సమావేశంలో ఎల్‌డీఎం హరిబాబు, హనుమంత రెడ్డి, అడిషనల్ డిఆర్డీఓ టి.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఉత్సవ్‌ను విజయవంతం చేయాలి

సిద్దిపేటరూరల్: విపంచి కళాభవన్‌లో 25న జరగనున్న జిల్లా స్థాయి యువ ఉత్సవ్ 2024–25ను విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ ఇతర అధికారులతో కలిసి కమిటీలు నియమించాలన్నారు. అనంతరం యువ ఉత్సవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంజిత్ రెడ్డి, డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఓ రవికుమార్, ప్రిన్సిపాల్స్ సునీత, జీవన్ కుమార్, డీఐఈఓ సూపరింటెండెంట్ మూర్తి పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలిస్తే ఏం లాభం

- కాంగ్రెస్ అభ్యర్థి, విద్యావేత్తను గెలిపిద్దాం
- మంత్రి కొండా సురేఖ



మాట్లాడుతున్న మంత్రి కొండా, చిత్రంలో నరేందర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించడం కోసం బీఆర్‌ఎస్ క్రాస్ ఓటింగ్‌కు ప్రయత్నిస్తోందని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్ రెడ్డి ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఉన్నప్పటికీ మొన్నటి బడ్జెట్‌లో రాష్ట్రానికి గుండా సున్నా నిధులు తెచ్చారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపిస్తే రాష్ట్రానికి వచ్చే లాభం ఏమి లేదన్నారు. అందువలన కాంగ్రెస్ పార్టీ బలపర్చిన, పేద ప్రజల ఇబ్బందులు తెలిసిన విద్యావేత్త ఆల్‌ఫోర్స్ నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ క్రాస్ ఓటింగ్ చేపించి బీజేపీ అభ్యర్థులను గెలిపించే విధంగా కృషి చేశారన్నారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలలో కూడా క్రాస్ ఓటింగ్ చేయించడానికి బీఆర్‌ఎస్ చూస్తుందని ఆరోపించారు. పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ పేదలు, విద్యార్థుల కష్టాలు తెల్సిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించుకుందామన్నారు. అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ నాయకులు హరికృష్ణ, అత్తుఇమామ్, శ్రీనివాస్ రెడ్డి, మంద పవన్, శివ చరణ్ రెడ్డి, సైదులు, రఘువర్ధన్ రెడ్డి, అంక్ష రెడ్డి, లక్ష్మీరెడ్డి, సూర్య వర్మ, ఎల్లం, రియాజ్, ఆనంద్, మహేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేలరాలిన మరో రైతు

- పంట నష్టం.. అనారోగ్యంతో సతమతం
- మనస్తాపంతో బలవన్మరణం



బొనాల శ్రీనివాస్ (ఫైల్)

హుస్నాబాద్‌రూరల్: పంట నష్టం.. అనారోగ్యంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన హుస్నాబాద్ మండలం తోటపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బోనాల శ్రీనివాస్(48)కు నాలుగు ఎకరాల భూమిలో వరి పంట సాగు చేశాడు. వానాకాలం పంట దిగుబడులు రాకపోవడం, యాసంగి వరి పంట కూడా ఆశించిన మేరకు లేకపోవడంతో శ్రీనివాస్ పంటల దిగుబడులపై దిగులు పడ్డాడు. పంట దిగుబడులు రాకపోతే పిల్లల ఫీజులు ఎలా కట్టాలని అలోచించాడు. పిల్లల కష్టాలను చూడకుండానే లోకం విడిచి వెళ్లిపోవాలని నిర్ణయించకొని గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శ్రీనివాస్ భార్య పద్మ ఫిర్యాదు చేయగా ఎస్సై మహేశ్ కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.తలకొరివి పెట్టిన కూతురు ''ఇద్దరు అడబిడ్డలైనా ఏనాడూ అధైర్యపడలేదు. ఉన్నత చదువులు చదివిస్తే ప్రయోజకులు అవుతారని కలలు కన్నావ్.. పంటలు పండలేదని, ఆరోగ్యం సహకరించడం లేదని మాకు ఒక మాట కూడా చెప్పకపోతివా నాన్న..! పిల్లల ఫీజులు ఎట్లా కట్టాలని దిగాలుతో మమ్ములను విడిచి వెల్లిపోయావా నాన్న''అంటూ బీటెక్ చదువుతున్న కూతురు అక్షయ రోదనలు గ్రామస్తులను కలిచి వేశాయి. అయ్యో పాపం అంటూ గ్రామస్తులు కన్నీరు పెట్టారు. కాగా, తండ్రి మృతదేహానికి కూతురు అక్షయ తలకొరివి పెట్టింది.

విద్యార్థుల భవిష్యత్‌ను గాలికొదిలిన హరికృష్ణ

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

గజ్వేల్‌రూరల్: కోచింగ్ సెంటర్ల పేరుతో పుస్తకాలు రాసి కోట్లు సంపాదించి, కళాశాలకు హాజరు కాకుండా విద్యార్థుల భవిష్యత్‌ను గాలికొదిలిన వ్యక్తి ప్రసన్న హరికృష్ణ అని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు హరిప్రసాద్ ఆరోపించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్‌కు మద్దతుగా శనివారం గజ్వేల్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల మధ్య చీలికలకు హరికృష్ణ ప్రయత్నం చేస్తూ, బీజేపీ కనుసన్నల్లో పనిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ టికెట్ నిరాకరించడంతో బీఆర్‌ఎస్ వైపు అడుగులు వేయగా అక్కడ కూడా నిరాశ ఎదురవడంతో బీఎస్పీ టికెట్‌పై పోటీ చేస్తూనే బీజేపీతో కుమ్మక్కయ్యాడని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగిగా విద్యార్థులకు పాఠాలను బోధించాల్సిన వ్యక్తి కోచింగ్ సెంటర్ల ద్వారా కోట్లు దండుకున్నాడని, ఏనాడూ బీసీలను పట్టించుకోలేదని మండిపడ్డారు. రవీందర్‌సింగ్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అనిల్‌గౌడ్, శివకుమార్, అశోక్, సంపత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిరుత దాడిలో దూడ మృతి



దూడ కళేబరం వద్ద బాధిత రైతు

రామాయంపేట(మెదక్): రామాయంపేట పట్టణ శివారులో చిరుత దాడి చేసి దూడను హతమార్చింది. మున్సిపాలిటీ పరిధిలోని గుల్పర్తి గ్రామానికి చెందిన రైతు స్వామి తన పశువులను వ్యవసాయ బావి వద్ద ఉంచగా, రాత్రి చిరుత దాడి చేసి హతమార్చింది. స్వామి ఉదయం పొలానికి వెళ్లి చూడగా, హతమైన దూడ కనిపించింది. సమీపంలో చిరుత పాదముద్రలు ఉండటంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశాడు. రైతులు జాగ్రత్తగా ఉండాలని, ఒకరిద్దరు వెళ్లకుండా కలిసి కట్టుగా వెళ్లాలని రేంజ్ అధికారి విద్యాసాగర్ సూచించారు.

బస్సు డ్రైవర్ చాకచక్యం

నాచగిరి వద్ద ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ
ప్రయాణికులకు తప్పిన ముప్పు



ఘటనా స్థలంలో టిప్పర్, ఆర్టీసీ బస్సు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచగిరి వద్ద శనివారం ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. స్థానికులు, బస్సు డ్రైవర్ రబ్బాని తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం ప్రయాణికులతో గజ్వేల్ నుంచి సంగారెడ్డికి బయల్దేరింది. నాచగిరి క్షేత్రం బ్రిడ్జి వద్దకు చేరేసరికి ఎదురుగా వస్తున్న ఓ టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో వాహనాలు స్వలంగా దెబ్బతిన్నాయి. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

యువకుడి మృతి

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. మండలంలో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. న్యాల్‌కల్ గ్రామానికి చెందిన నాగరాజు(30) జహీరాబాద్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం కుప్పానగర్ గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి బయల్దేరిన నాగరాజు ఊరికి చేరుకుని రోడ్డుపక్కనే వాహనం నిలుపుతుండగా...జహీరాబాద్ వైపు నుంచి మైనర్ బాలుడు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో నాగరాజుకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఖేలో ఇండియాకు విజ్ఞాన్ విద్యార్థులు



సౌత్‌జోన్ పోటీలకుఎంపికైన విద్యార్థులు

సదాశివపేట(సంగారెడ్డి): ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన ఖేలో ఇండియా ఆటల పోటీలకు సౌత్‌జోన్‌కు స్థానిక విజ్ఞాన్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా ఆటలకు సంబంధించి రాష్ట్రస్థాయి పోటీల్లో భావిక, సాయిశృతి, వైష్ణవి, హరిచందనలు గెలుపొందారని పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌గౌడ్, ప్రిన్సిపాల్ అనురాధ,వైస్ ప్రిన్సిపాల్ సిద్ధన్న శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాసి పెట్ ఉండాలి

దర్జా బతుకు..!



- కుక్కలకు పెరుగుతున్న క్రేజ్
- ప్రత్యేక నిపుణులతో శిక్షణ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెట్ లవర్స్ సిటీలో ఈ పదానికి ఒక క్రేజీ ఏర్పడింది. మనుషులే కాకుండా వారి జీవితాల్లో సాధు జంతువులను మమేకం చేసుకుంటూ ఆత్మీయంగా పెంచుతున్నారు. నిత్య జీవితంలో ఎంత బిజీ ఉన్నప్పటికీ మూగజీవాలపై తన వంతు మమకారాన్ని చూపిస్తున్నాడు. అందుకోసం ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడడం లేదు. వేలాది రూపాయలతో కొనుగోలు చేయడమే కాకుండా విలాసమైన జీవితాన్ని అందిస్తున్నారు. వారి స్థాయికి తగ్గట్టుగా విలాసమైన సౌకర్యాలను కల్పించి సంబురపడుతున్నారు. దానికి చిన్న అనారోగ్య సమ్యస వచ్చినా తట్టుకోలేని పరిస్థితికి వచ్చాడంటే ఆ మూగ జీవాలపై ఎంత బంధం పెంచుకున్నాడో అర్థమవుతుంది.


పెరుగుతున్న డిమాండ్

చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి ఇళ్లలో పెట్స్ పెంచుకోవడానికి ఎంతో ఆసక్తి చూపుతున్నారు. దీంతో మేలు జాతి డాగ్‌లను విక్రయించేందుకు అనేక మంది ముందుకొస్తున్నారు. చాలా మంది ప్రశాంతత కోసం పెట్స్‌ను కొనుగోలు చేస్తున్నారు. మరి కొంత మంది ఇంటి రక్షణ కోసం పెట్స్‌ను పెంచుతున్నారు. ఈ క్రమంలో మేలు జాతి డాగ్‌లకు రోజురోజుకూ మంచి డిమాండ్ పెరుగుతుంది.



డాగ్‌లకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్

పలు జాగ్రత్తలు తీసుకోవాలి



కుక్కలు పుట్టిన తర్వాత 15రోజుల నుంచి 3నెలల వరకు ప్రతీ 15రోజుల కొకసారి, 3 నుంచి 6నెలల వరకు ప్రతీ నెల నట్టలమందు తాగించాలి. 7 ఇన్ వాన్ వ్యాక్సిన్ కుక్కలకు ముఖ్యమైంది. పుట్టిన 45రోజులు దాటాక మొదటి వ్యాక్సిన్, ఆ తర్వాత 3 వారాలకు రెండో వ్యాక్సిన్ ఇవ్వాలి. ఇవి ప్రతీ ఏటా క్రమం తప్పకుండా ఇవ్వాలి. –డా.వంశీ కృష్ణారెడ్డి, పశువైద్య సహాయ శస్త్రచికిత్సకుడు, రామచంద్రాపురం



పెట్స్ క్లబ్‌లో బోర్డింగ్‌లో సేద తీరుతున్న డాగ్స్

జోరుగా పెట్ క్లబ్‌లు

అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడానికి ఆసక్తిని చూపడంతో మార్కెట్‌లో అందుకు అనుగుణంగా పెట్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పెట్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు, గొలుసులు, షాంపులు, బొమ్మలు, టీ షార్ట్స్, హెర్ కట్టింగ్‌లతోపాటు వాటి బాతింగ్, స్విమ్మింగ్ చేయిస్తారు. ఎవరైనా దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి డాగ్‌లకు ఇక్కడే బోర్డింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అందుకు గంటకు రూ.50, రోజుకు రూ.800 చార్జీ చేస్తారు. దానికి ఏసీ గదితోపాటు ఆహారం అందిస్తారు. ఈ క్రమంలో పెట్ క్లబ్‌లకు మంచి డిమాండ్ వచ్చింది.



పెంపుడు డాగులతో యజమాని

జాతిని బట్టి ఖరీదు

ఇళ్లలో పెంచుకొనే పెట్స్ జాతిని బట్టి ధర ఉంటుంది. డాగ్స్‌లో సుమారు 360 జాతులు ఉండగా అందులో స్నేహపూర్వకంగా ఉంటే డాగ్స్ మాత్రమే మంచి డిమాండ్ ఉంది. వాటిలో కొన్ని జాతి డాగ్‌లను మాత్రమే ఎంచుకుంటున్నారు. అందులో ప్రధానం ల్యాబ్ జాతి పిల్ల రూ.15 వేల నుంచి రూ.40 వేల వరకు నుంచి లభిస్తుంది. గోల్డెన్ రిట్రీవర్ జాతి డాగ్ రూ.20 వేల నుంచి నాణ్యతను బట్టి రూ.80 వేల వరకు లభిస్తుంది. జర్మన్ షెపర్డ్ రూ.10 వేల నుంచి నాణ్యత బట్టి రూ.60 వేల వరకు లభిస్తుంది. పూడ్లే జాతి డాగ్ రూ.80 వేల నుంచి రూ.1.5 లక్ష వరకు లభిస్తుంది. హస్కీ జాతీ డాగ్ రూ.60 వేల నుంచి మొదలవుతుంది. విదేశీకి చెందిన జాతి డాగ్‌లు రూ.3 లక్షలపై ధర ఉంటుందని వ్యాపారస్తులు చెబుతున్నారు.

శిక్షణ కేంద్రాలు, తప్పిపోతే ప్రకటనలు

ఇళ్లలో పెంచుకునే పెట్స్‌కు ప్రతేక్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందరితో స్నేహంగా ఉండేందుకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. నెల రోజులు శిక్షణ కోసం రూ.25 వేల నుంచి రూ.35 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. శిక్షణ పొందిన కుక్కలు అందరి దగ్గరికి వెళ్తుంటాయి. ఇంటి వాళ్లని తొందరగా గుర్తిస్తుంటాయి. ఎవరిపైనా దాడి చేయకుండా ఉంటాయి. ఒక వేళ ఇంట్లోని పెంపుడు డాగ్ తప్పిపోతే అందుకు ప్రకటనలు సైతం చేస్తున్నారు. డబ్బు ఎంతైన ఖర్చు చేస్తున్నారు. దానిని వెతికి తెచ్చిన వారికి బహుమతులు సైతం అందజేస్తున్నారు.

ఎంతో ఉపాధి లభిస్తుంది



అనేక మంది పెట్స్‌ను పెంచుకోవడం వల్ల అనేక మందికి ఉపాధి లభిస్తుంది. నేను కోవిడ్ సమయంలో మిత్రుల డాగ్స్‌తో ఆడుకుంటూ దానిని వృత్తిగా మార్చుకున్నాను. తెల్లాపూర్‌లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసి పలువురికి ఉపాధి కల్పిస్తున్నాను. మా శిక్షణ కేంద్రంలో డాగ్స్ మెరుగైన శిక్షణ అందిస్తున్నాం.

– గాంధీ కృష్ణయాదవ్, డాగ్ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు

హ్యాపీ అని పేరు పెట్టాం



మాకు, మా బాబుకి మా హ్యాపీ అంటే ఎంతో ప్రాణం. షిహ్ త్జు జాతికి చెందిన డాగ్‌ను మూడేళ్ల కిందట రూ.20 వేలు పెట్టి కొన్నాం. ఇప్పుడు అది మాలో ఒక్కటి. ఇవి ఎంతో విశ్వాసంతో ఉంటాయి. దానితో మేము ఆడుకుంటాం. ఎవరిపైన దాడి చేయదు. డాగ్‌కు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం.

– సాయి, విద్యుత్‌నగర్

ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం

డాగ్‌లకు ఎంతో విశ్వాసం ఉంటుంది. అందుకే అవి అంటే నా ఎంతో ఇష్టం. మేము పెంచుకున్న డాగ్ కొన్ని నెలల కిందట చనిపోయింది. దాని నుంచి కోలుకోవడం కోసం ఎంతో సమయం పట్టింది. దానిని మా ఇంటి ఆవరణలోనే పూడ్చిపెట్టాం. దాని గుర్తుగా మొక్కలను పెంచుతున్నాం.

– ప్రియాంక, రామచంద్రారెడ్డినగర్

కొన్ని జాతులు.. వాటి ధరలు



సమోయెడ్ – స్నేహపూర్వక ప్రవర్తనకు ప్రసిద్ధి. తెల్లని వెంట్రుకలతో అందంగా ఉంటాయి. వీటి ధర రూ.45 నుంచి రూ.1.30లక్షల వరకు ఉంటుంది. ధర ఎక్కువైనా వీటికి మార్కెట్‌లో భలే డిమాండ్ ఉంది. కొనుగోలు చేసేందుకు పోటీ పడుతుంటారు.

ఇంగ్లిష్ బుల్‌డాగ్– బుల్‌డాగ్స్‌గా పిలుచుకునే విలక్షమైన జాతి కుక్కలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఇవి ప్రత్యేకమైన రూపాన్ని కలిగి ఉంటాయి. వీటి ధర మార్కెట్లో రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.

ఆఫ్ఘన్ హౌండ్– ఇవి చూడటానికి వింతగా కన్పిస్తాయి. ఒకానొక సందర్భంలో అసలు ఇవి కుక్కలేనా అన్న సందేహమూ కలుగుతుంది. పొడవాటి మెడను, సిల్కీ వెంట్రుకలను కలిగి ఉండే వీటికి మార్కెట్‌లో రూ.60వేల నుంచి రూ.80వేల వరకు ధర పలుకుతుంది.



సైబీరియన్ హస్కీ– ఈ జాతికి చెందిన కుక్కలు నీలి కళ్లతో ఉంటాయి. వీటిని చాలామంది ఇష్టపడతారు. వీటి ధర దాదాపు రూ.40వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుంది.



పెట్ క్లబ్‌లో డాగ్స్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు

రోట్ వీలర్– ఈ జాతికి చెందిన డాగ్స్ అత్యంత శక్తివంతమైనవి. విశ్వాసమైనవి కూడా. కేసులను ఛేదించేందుకు పోలీసులు వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. వీటి ధర రూ.10వేల నుంచి రూ.80వేల వరకు ఉంటుంది.



టిబెటిన్ మాస్టిఫ్– ఇవి చూడటానికి చాలా పెద్దగా, గంభీరంగా కనిపిస్తాయి. మందపాటి చర్మంతో భయానకంగా కనిపించే డాగ్స్ అత్యంత అరుదుగా దొరుకుతాయి. దేశంలోనే అత్యంత ఖరీదైన, అరుదైన జాతుల్లో ఇవి ఒకటి. వీటి ధర రూ.60వేల నుంచి రూ.2.50లక్షల వరకు ఉంటుంది.

అప్రజాస్వామిక విధానాలపై ప్రశ్నిస్తాం

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తిసంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జ్ఞాన మంజరి

ఎడ్యుకేషన్: విద్యా వ్యాపారులను ఓడించి, ఉపాధ్యాయ ఉద్యమ నేత అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విజ్ఞప్తి చేశారు. శనివారం సంగారెడ్డిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానమంజరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలోకి పోటీలోకి వచ్చిన రియల్ ఎస్టేట్ విద్య వ్యాపారులను ఓడించి ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడైన వై. అశోక్ కుమార్‌ని గెలిపించాలని కోరారు. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ప్రశ్నించి ఎండబెట్టడానికి పెద్దల సభకి ఉద్యమ నాయకుడి పంపించడం అవసరమని కోరారు. టీఎస్ యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు కోశాధికారి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సాయి తేజ, జిల్లా కమిటీ సభ్యులు వెంకయ్య పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు


- 5 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్



నిందితుడిని చూపుతున్న ఏసీపీ మధు, సీఐ ఉపేందర్

సిద్దిపేటకమాన్: ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తున్న అంతర్ జిల్లా దొంగను టూటౌన్ పోలీసులు అరెస్టుచేసి, అతడి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకొన్నారు. ఏసీపీ మధు, టూటౌన్ సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. పట్టణంలోని టెలికమ్ నగర్‌కు చెందిన దయానంద్ తన ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని కొద్ది రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో వారు నర్సాపూర్ డబుల్ బెడ్రూంలకు వెళ్లే రాజీవ్ రహదారిపై అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన ఆస సుదర్శన్ కొద్ది రోజులుగా పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లుగా ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు గతంలో వివిధ కేసులలో జైలుకు వెళ్లి వచ్చినట్లు చెప్పారు. దీంతో నేరస్థుడిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ మధు, సీఐ ఉపేందర్ తెలిపారు. కీలకంగా వ్యవహరించిన క్రైం కానిస్టేబుళ్లు కనకరాజు, ప్రశాంత్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌ను అభినందించి, నగదు రివార్డు అందజేశారు.

380 కుట్టు మెషీన్లు ఉచిత పంపిణీ



మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న సచిన్, లక్ష్మారెడ్డి

జహీరాబాద్: పేదలు స్వయం ఉపాధిని పొంది వారి కాళ్లపై వారు నిలబడేందుకుగాను కుట్టు శిక్షణ పొందిన 380 మంది మహిళలకు కోల్ ఇండియా సంస్థ ఉచితంగా కుట్టు మెషీన్లు పంపిణీ చేసింది. ఈ మేరకు ఆ సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సచిన్ శనివారం మీడియాకు వెల్లడించారు. జహీరాబాద్‌లోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జి అండ్ సరీ్వస్ సంస్థ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు వీటిని అందజేసినట్లు తెలిపారు. సంస్థ సాధిస్తున్న లాభాల్లో కొంత సొమ్మును దేశ వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను కేటాయిస్తున్నట్లు చెప్పారు. జహీరాబాద్‌లో వికాస్ సంస్థ తరపున శిక్షణ పొందిన 560 మందికి ఇప్పటివరకు రెండు విడతల కింద ఉచితంగా కుట్టు మెషీన్లను అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు కె.లక్ష్మారెడ్డి, వికాస్ సంస్థ డైరెక్టర్లు శుక్లవర్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సబ్ కోఆర్డినేటర్ రాంచంద్రారెడ్డి, శిక్షకులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

బంగారం, వెండి, నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

జోగిపేట(అందోల్): జోగిపేట పట్టణంలోని మల్లన్నగండికి చెందిన కటికె మహేశ్ ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. 3వవార్డులో నివసిస్తున్న మహేశ్ ఈనెల 18న జగ్గిరిగుట్టలోని బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి శనివారం వచ్చేసరికి ఇంటికి తాళం పగలగొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, 20 తులాల వెండి, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్ఐ పాండు సంఘటన స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అంబయ్య (ఫైల్)

జిన్నారం (పటాన్‌చెరు): మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి కథనం ప్రకారం .. మున్సిపాలిటీలోని దోమడుగు గ్రామానికి చెందిన ఏరు అంబయ్య (44), గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఇబ్బంది పడుతున్నాడు. ప్రతిరోజు బయటకు వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి వచ్చేవాడు. ఈనెల 10న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ దొరకలేదు. శనివారం అంబయ్య వదిన వినోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదం ముగ్గురికి తీవ్ర గాయాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి చౌరస్తాలో బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. శనివారం మండలంలోని శాలిపేటకు చెందిన వ్యక్తి టిప్పర్‌ను తప్పించబోయి బైక్ అదుపు తప్పి కిందపడిపోయాడు. ఇదే సమయంలో మెదక్ నుంచి చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో విధులు నిర్వహించేందుకు వస్తున్న ఇద్దరు వ్యక్తులు కిందపడిపోయిన బైక్‌ను ఢీ కొని ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో కళాశాల సిబ్బంది పవన్ కాలు, ఉమర్ చేయి విరిగింది. విషయం గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో తీవ్రగాయాలకు గురైన వారిని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తి మృతితో.. ఏళ్ల నాటి భూసమస్య పరిష్కారం

జగదేవ్‌పూర్(గజ్వేల్): దశాబ్దం పైగా భూ సమస్య ఓ వ్యక్తి మృతితో పరిష్కారం అయింది. ఈ సంఘటన మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జగదేవ్‌పూర్‌కు చెందిన కొత్త మాల్లారెడ్డికి 1.08 ఎకరం వ్యవసాయ భూమి తన అన్నదమ్ములు కొడుకు నర్సింహారెడ్డి పేరు మీద పడింది. అయినప్పటికీ కబ్జాలో ఉంటూ మల్లారెడ్డి కుమారులు సాగు చేసుకుంటున్నారు. వీరి మధ్య కొంతకాలంగా భూ సమస్య నెలకొంది. పలుసార్లు కుల పెద్దల మధ్య పంచాయితీ నిర్వహించినా భూ సమస్య పరిష్కారం కాలేదు. శనివారం మల్లారెడ్డి(70) గుండెపోటుతో మృతి చెందగా కుమారులు తండ్రి మృతదేహాన్ని అంబులెన్స్‌లో నర్సింహారెడ్డి ఇంటి ముందు పెట్టి నిరసన తెలిపారు. భూమి బెంగతోనే మా నాన్న మృతి చెందడాన్ని మల్లారెడ్డి కుమారులు ఆరోపించారు. తమ భూమి తమకు చేయాలని నిరసన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను సముదాయించారు. భూమిని మల్లారెడ్డికి చేయిస్తామని చెప్పడంతో హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం అంత్యక్రియలు చేపట్టారు.

డెలివరీ గోదాంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గజ్వేల్‌రూరల్: డెలివరీ గోదాంలో చోరీ జరిగిన సంఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డు మార్గంలోని ఓ డెలివరీ గోదాం షెటర్ తాళాన్ని కట్ చేసి అందులోని 5 సెల్‌ఫోన్లు, రూ.90వేల నగదును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గోదాంకు సంబంధించిన బీరువాను సమీపంలో ఉన్న చెరువు వద్ద పడేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా క్లూస్ టీంతో అక్కడికి చేరుకొని ఆధారాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాపర్‌వైర్ చోరీ

గజ్వేల్‌రూరల్: ట్రాన్స్‌ఫార్మర్ నుంచి కాపర్‌వైర్ చోరీకి గురైన సంఘటన శనివారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని లింగరాజ్‌పేట సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగలగొట్టి అందులో ఉన్న కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. విద్యుత్‌శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని దాచారం శివారులో టాస్క్‌ఫోర్స్, బెజ్జంకి పోలీసులు శుక్రవారం రాత్రి ఓ పేకాట శిబిరంపై దాడిచేశారు. పేకాడుతున్న ఆరుగురుని అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.6,480, మూడు మోటార్ బైకులు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్ఐ శంకర్‌రావు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు ఆయన చెప్పారు.

విద్యార్థుల్లోనూ సాక్షికి ఆదరణ



సాక్షి పత్రికను చదువుతున్న విద్యార్థులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): సాక్షి తెలుగు దిన పత్రికకు సమాజంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి రోజు ఒక పీరియడ్ లైబ్రరీకి కేటాయిస్తారు. ఇందులో విద్యార్థులు రకరకాల పుస్తకాలతో పాటుగా సాక్షి తెలుగు దిన పత్రికను సైతం ప్రతి రోజు చదువుతూ సమాజంలో జరిగే సంఘటనలను తెలుసుకుంటున్నారు. సదాశివపేట మండలంలోని నిజాంపూర్(కే) ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులు సాక్షి పత్రికను చదువుతుండగా.. సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది.